క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అబ్దుల్ రవూఫ్

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల రవూఫ్ అన్నారు. శనివారం స్థానిక ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాలలో రక్తదానం ఆవశ్యకతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన స్త్రీ, పురుషులు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామి వారు

జామి: భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం, స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారిని తులసీదళాలు, వివిధ పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఎం.కొత్తవలసలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి, సిబ్బంది

గజపతినగరం: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. 59 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో కలిసి గృహసందర్శన చేసి గర్భిణులు, వృద్ధులకు వైద్య తనిఖీలు చేశారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు



స్కూటీ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన బాలుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నవీన్‌పడాల్

లక్కవరపుకోట: మైనర్లకు ద్విచక్ర, ఇతర వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమో దు చేస్తామని ఎస్ఐ నవీన్‌పడాల్ హెచ్చరించారు. మండలంలోని సోంపురం జంక్షన్ సమీపంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేవారిపై, వాహనాలు నడుపుతున్న మైనర్లపై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న ఆరుగురు వాహన చోదకులపై, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. అలాగే స్కూటీ నడుపుతున్న ఒక బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, ఆ బాలుడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హైరిస్క్ గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

వేపాడ: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ధరణి, గైనకాలజిస్ట్ ఎస్.ఫణిశ్రీ 39 మంది గర్భిణులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారు పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. క్రమం తప్పకుండా తనిఖీలు చేయించు కోవాలని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. బానాది సత్యసాయి భక్తి మండలి సభ్యులు సమకూర్చిన భోజనాలను డాక్టర్ ధరణి గర్భిణులకు వడ్డించారు. సీహెచ్ఓ ఆంజనేయులు, పాల్గొన్నారు.

హైవేపై వేగ నిరోధకాల ఏర్పాటు

బొండపల్లి: మండలంలోని అంబటివలస జంక్షన్ నుంచి రోళ్లవాక జంక్షన్ వరకు జాతీయ రహదారి-26పై ఎస్ఐ యు.మహేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వేగనిరోధకాలను ఏర్పాటు చేశారు. ఈరెండు జంక్షన్‌ల మధ్యలో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండడంతో ఇటీవల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసులతో కలిసి రహదారిని పరిశీలించారు. ఎస్పీ సూచనలు మేరకు జాతీయ రహదారిలో స్టాపర్లను ఏర్పాటు చేశామని ఎస్ఐ చెప్పారు. ఎంపీటీసీ తాళ్ల పూడి అప్పలనాయుడు, ఉప సర్పంచ్ ఆర్.రాము పాల్గొన్నారు.

ముక్తిదాం క్షేత్రం చూసొద్దాం రండి..



గోవిందపురం ముక్తిదాం క్షేత్రం



ముక్తిదాం క్షేత్రంలో నంది విగ్రహం

- ఓ వైపు ఆధ్యాత్మికం.. మరోవైపు ఆహ్లాదం..
- చింతపల్లిలో ఆహ్లాదకరమైన సముద్ర తీరం
- నక్కానపేటలో షిర్డీసాయి మహాస్తూపం
- కార్తీకమాసంలో పర్యాటకుల తాకిడి



పాండవసదనం



కనువిందు చేస్తున్న చింతపల్లి బీచ్



నక్కానపేటలోని షిర్డీసాయి మహాస్తూపం

భక్తుల తాకిడి ఎక్కువ..

కార్తీకమాసంలో ముక్తిదాం క్షేత్రానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ క్షేత్రంలో ఉన్న ధాన్యమందిరంలో కాసేపు ధ్యానం చేస్తే మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. ఈ ప్రాంతం పిక్నిక్‌లకు అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది వస్తుంటారు.

– పి. భాస్కరరావు, పతివాడ

అభివృద్ధి చేయాలి...

చింతపల్లి సముద్రతీరం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ రిసార్ట్స్, హోటళ్లు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా ప్రారంభించలేదు. ఎక్కువ మంది పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

– ఎం.వెంకటరావు, చింతపల్లి

పూసపాటిరేగ: మనసుకు ఉల్లాసాన్నిచ్చే సముద్ర తీరం .. ఆహ్లాదకర వాతావరణం నడుమ ముక్తిదాం క్షేత్రం కొలువై ఉంది. కొబ్బరి, సరుగుడు తోటల మధ్య పర్యాటకులకు స్వాగతం పలుకుతున్న గోవిందపురం ముక్తిదాం క్షేత్రాన్ని ప్రతి ఒక్కరూ దర్శించుకోవాల్సిందే. ఈ క్షేత్రానికి సమీపంలోని నక్కానపేట షిర్డీసాయి నగర్‌లో రాష్ట్రంలోనే ఎత్తైన షిర్డీసాయి మహాస్తూపం, అలాగే సహజ సౌందర్యాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటకుల మది దోచే చింతపల్లి బీచ్ ఉంది. ఏటా కార్తీకమాసంలో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది పర్యాటకులు, భక్తులు ముక్తిదాం, చింతపల్లి, నక్కానపేట ప్రాంతాలకు వస్తుంటారు. విజయనగరం నుంచి వచ్చే పర్యాటకులకు 35 కిలోమీటర్లు.. పూసపాటిరేగ నుంచి వచ్చే పర్యాటకులకు 15 కిలోమీటర్ల దూరంలో ముక్తిదాం క్షేత్రం ఉంది. బస్సులు, ఆటోల ద్వారా చేరుకోవచ్చు. గోవిందపురం గ్రామ సమీపంలో 1991లో పోతినిండి కనకదుర్గమ్మ ముక్తిదాం క్షేత్రాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ నిర్మించిన గీతా మందిరంలో కొంతసేపు సేద తీరినట్లయితే మనసు ఆధ్యాత్మిక భావాలలో పులకించిపోతుందని భక్తులు చెబుతుంటారు. గీతా మందిరం చుట్టూ రామాయణ, మహాభారత ఘట్టాలు చూపరులను కట్టి పడేస్తాయి. పాండవుల చరిత్ర, నంది విగ్రహం, దేవతామూర్తులు ఆలయాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. ముక్తిదాం క్షేత్రంలో భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

రాష్ట్రంలోనే ఎత్తైనది..

గోవిందపురం రహదారిలో గల నక్కానపేట సమీపంలో రాష్ట్రంలోనే ఎత్తైన 141 అడుగులు షిర్డీ సాయి మహాస్తూపం భక్తులను ఆకట్టుకుంటోంది. నిత్యం వందల సంఖ్యలో భక్తులు షిర్డీసాయి ఆలయం, మహాస్తూపాన్ని దర్శించుకుంటారు.

ఆహ్లాదపరిచే చింతపల్లి బీచ్..

చింతపల్లి తీరంలో బీచ్ పర్యాటకులకు కనువిందు చేస్తోంది. బీచ్‌లో హొయిలొలికించే అందాలు కనిపిస్తాయి. బ్రిటీష్ కాలం నాటి లైట్‌హౌస్, సముద్రంలో నిర్మించిన తిరుమల ఫ్యూజిటిక్ వంతెన ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వమే రిసార్ట్సు, హోటళ్లు నిర్మించినప్పటికి అందుబాటులోకి తీసుకురాలేదు. చింతపల్లి తీరం పర్యాటకులను కట్టి పడేస్తుంది. పిక్నిక్ సీజన్‌లో చింతపల్లి తీరప్రాంతం వేలాదిమంది పర్యాటకులతో సందడిగా మారుతోంది.

విద్యార్థి దశ కీలకం..

- విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు





ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు

డెంకాడ: జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమని, ఈ సమయంలో విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు.. తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు.. ర్యాగింగ్‌కు పాల్పడితే కలిగే నష్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పిల్లలను ఉన్నతంగా చూడాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి చదివిస్తున్న విషయం మరువరాదన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. చిన్న చిన్న తప్పుల వల్ల జీవితాలు నాశనమవుతాయని సూచించారు. మాదకద్రవ్యాలు వినియోగించినా.. రవాణా చేసినా చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై ఎ.సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



జొన్నవలసలో పిచ్చి మొక్కలతో నిండి పోయిన సామూహిక మరుగుదొడ్లు



రాకోడులో తలుపులు ఊడిపోయి మూలకు చేరిన సామూహిక మరుగుదొడ్లు

విజయనగరం రూరల్: బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలకాలన్న లక్ష్యంతో గ్రామాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. మండలంలోని 22 పంచాయతీల్లో 7,71,000 రూపాయలతో 514 సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో మరుగుదొడ్ల నిర్వహణ బాగానే జరిగినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహణ పట్టించుకోలేదు. నీరు, విద్యుత్ సదుపాయం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలో ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో మరుగుదొడ్లు శిథిలమైపోయి విష జంతువులకు నిలయంగా మారగా.. మరికొన్ని గ్రామాల్లో తలుపులు లేక, గోడలు బద్దలై వినియోగానికి దూరమయ్యాయి. అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హీరో వరుణ్‌తేజ్ రాక నేడు

విజయనగరం టౌన్: నగరంలోని ఆదిత్యా థియేటర్‌లో హీరో వరుణ్‌తేజ్ ఆదివారం సందడి చేయనున్నారు. ఈ మేరకు స్థానిక జీఎస్ఆర్ గ్రాండ్‌లో శనివారం మెగా అభిమాన సంఘ నాయకుడు గురాన అయ్యలు వివరాలు వెల్లడించారు. హీరో వరుణ్‌తేజ్ నటించిన మట్కా చిత్రం న్యూ పోస్టర్ రిలీజ్ కార్యక్రమం ఆదివారం ఉదయం జరగనుందన్నారు. అభిమానులందరూ కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో త్యాడ రామకృష్ణ, రాంకీ, కె.కృష్ణారావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు శనివారం తెలిపారు. బొబ్బిలి కలువరాయికి చెందిన మరిచర్ల ప్రసాద్ ప్రయాణికుల వద్ద నుంచి మొబైల్‌ను దొంగతనం చేయగా.. సాంకేతిక పరిజ్ఞానంతో అతన్ని పట్టుకుని మొబైల్ రికవరీ చేశామనిన ఎస్సై చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పైడితల్లి సన్నిధిలో న్యాయమూర్తులు..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు కె.సురేష్‌రెడ్డి దంపతులు, జస్టిస్ ఎస్.జయసూర్య శనివారం దర్శించుకున్నారు. ఈఓ ప్రసాదరావు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదాశీస్సులతో పాటూ ఆలయ ఈఓ ప్రసాదరావు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. – విజయనగరం టౌన్

అన్నదానం మిన్న..



వందలాది మందికి అన్న ప్రసాదం అందించడం చాలా గొప్ప విషయమని.. అన్ని దానాలలో కన్నా అన్నదానం మిన్న అని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అయ్యప్ప భక్తుల కోసం నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కంది మురళీనాయుడు, పెంటపాటి కామరాజు, ప్రముఖ వ్యాపారులు శివ్వా నాని, పెంటపాటి ముత్యాలు, నారాయణం లక్ష్మణరావు, కలగర్ల నారాయణరావు, సునీల్ జైన్, సునీల్, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

బియ్యం బస్తాల వితరణ



నగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ సభ్యులు 35 బస్తాల బియ్యాన్ని శనివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, వైద్యం, వివాహ సమయంలో సహాయం చేసేందుకు చారిటీ గ్రూప్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రూప్ కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, బీవీపీఎస్ రామయ్య, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కల్లూరి సతీష్, దేవాలయం కార్యదర్శి పెంటపాటి కామరాజు, కంది మురళీనాయుడు స్వామి, సునీల్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

దరఖాస్తుల స్వీకరణ



రామతీర్థం జంక్షన్ పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల: ఓటర్ల నమోదుతో పాటు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి అధికారులు శనివారం దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నెల్లిమర్ల పట్టణంలోని రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ స్టేషన్ నంబర్ 27, 28, 29, 30లకు సంబంధించి ఏర్పాటైన కేంద్రాన్ని తహసీల్దార్ బి.సుదర్శనరావు సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న బీఎల్‌ఓలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు పాల్గొన్నారు. మండలం వ్యాప్తంగా ఈ కార్యక్రమం ఈనెల 10వ తేదీ ఆదివారం కూడా కొనసాగుతుందని.. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని తహసీల్దార్ సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎలక్ట్రికల్ రిక్షాలు మంజూరు చేయండి



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మారుతీ వికలాంగుల సంఘ సభ్యులు

భోగాపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించడానికి శనివారం విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను మండల మారుతి వికలాంగుల సంఘ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని ఇద్దరు దివ్యాంగులకు త్రీవీలర్ ఎలక్ట్రికల్ రిక్షాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కారిగొల్లపేట, భోగాపురం గ్రామాలకు చెందిన బమ్మిడి పాపారావు, నరేడ్ల కామేశ్వరరావులకు ట్రై సైకిళ్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ ట్రై సైకిళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

నిత్యాన్నదానానికి పోటెత్తిన భక్తులు



నిత్యాన్నదాన కేంద్రం వద్ద భక్తుల రద్దీ

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి శనివారం భక్తులు పోటెత్తారు. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీరామ చంద్రస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ముందుగా స్థానిక భాస్కర పుష్కరిణిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ క్షేత్ర పాలకులుగా విరాజిల్లుతున్న ఉమా సదాశివుడిని దర్శించి, నిత్యాన్నదాన సత్రంలో స్వామివారి ప్రసాదం స్వీకరించారు. పలువురు ఔత్సాహిక భక్తులు బోడికొండపైకి వెళ్లి అలనాటి చారిత్రక ఆధారాలు తిలకించారు. – నెల్లిమర్ల రూరల్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com